# హాచ్ఛ్

సుశీలకు మా చెడ్డ చిరాగ్గా వుంది. వారంలో ఏడురోజులు భర్త ఆలస్యంగా ఇంటికి చేరుతుంటే చిరాగ్గా వుండక చిద్విలాసంగా వుంటుందామరి! ఆ రోజూ షరా మామూలే, ఆకాశవాణి ఆంగ్ల వార్తలు సమాప్తమయ్యే సమయానికి పిల్లిలా ఇంట్లో అడుగు పెట్టాడు రాంబాబు బాంబులా పేలిపోయింది సుశీల! నేనీ కాపురం చేసే ఓపిక పోయిందంటూ బిర్ర బిగుసుక్కూచుంది.

'చూడు సుశీలా అసలేం జరిగిందంటే ' రాంబాబు మాటలు పూర్తి కాకుండానే 'హరికథలొద్దు మహాశయా' అంది రక్కున సుశీల.

'కాదు కాదు వాస్తవగాధ నువ్వు విను. వింటే చాలా బాధపడతావ్' అంటూ మొదలెట్టి 'మా సుబ్బారావ్ లేడోయ్ అదే సుబ్బిగాడంటాం చూడూ వాడే పళ్ళెత్తు ఆ ఆ వాడికి పాపం మధ్యాహ్నం యాక్సిడెంటయింది. ముందు రెండు పళ్లు రాలిపోయాయి. ఇప్పుడు అందంగానే ఉన్నాడనుకో . అయినా మూతిదగ్గర వాచి మరీ హనుమంతరావులా వున్నాడు పాపం వాడిని హాస్పిటల్‌కి చేర్చి మందులవీ ఇప్పించి..ఆ పైన .."

"చాలండీ చాలు మిమ్మల్నపార్థం చేసుకొన్నాను. పాపిష్టిదాన్ని' రండి తిండి తిందాం పాపం ఆ సుబ్బారావుగారి కెలా వుందో భోంచేసి హాస్పిటల్‌గ్గానీ మళ్ళీవెళ్ళాలా నాకేం భయంలేదులెండి. కష్టంలో వున్న మిత్రుడ్ని ఆదుకోకపోతే మన స్నేహాలెందుకండీ " అంటూ తెగ బాధపడిపోయింది సుశీల. 'నా సుశీలదీ ఎంత దయార్ద్ర హృదయము' అంటూ మంద్రంగా పాడుకొంటూ స్లోమోషన్ సినిమా బొమ్మలా బాత్‌రూం వైపు నడిచాడు రాంబాబు.

భోజనాలయ్యాక విశ్రమించారు దంపతులు. హఠాత్తుగా సుశీల ఉలిక్కిపడి లేచి 'అయ్యయ్యో నా మతి మండా. .ఎంత పొరపాటు జరిగిందీ ఏమండీ నన్ను మన్నించండీ' అంటూ చెడామడా వాపోసాగింది.

'బాధపడకు ప్రియతమా అసలేం జరిగింది ' ఓదార్పుగా అన్నాడు రాంబాబు.

'అదేనండీ మీ సుబ్బారావుగారు లేరూ అదే మీరు సుబ్బిగారంటారు పళ్ళెత్తు ఆఁ ఆఁ ఆయనే సాయంత్రం మీకోసం వచ్చారండీ పాపం ఏడు గంటల వరకూ ఆవలిస్తూ, సిగరెట్లు కాలుస్తూ హాల్లోనే కూర్చొని ఎదురు చూశారు కాఫీ రెండుసార్లిచ్చి మర్యాద చేశాననుకోండి. .మిమ్మల్ని ప్రొద్దున్నే ..'

"ఆపు నేను వినలేను. నిజం చెప్పేస్తాను రామారావూ,రాజూ రెండురౌండ్లు వేసుకుందామంటే అబ్బే అది కాదు. పేక రెండురౌండ్లే అనుకున్నా గానీ వెధవది అలాగే మరో నాలుగు రౌండ్లు గడిచిపోయింది. రేపట్నుంచీ ఒట్టు ఏ ఒట్టుబడితే ఆ ఒట్టు ఒట్టుమీద ఒట్టు.. ఆరుదాటి ఇంటికొస్తే నాపేరు తీసి మరో పేరు పెట్టు లేదా నన్ను కొట్టు కాని

ఇప్పటికి మాత్రం . కోపం తగ్గించు
సుశీలా నా జీవన ప్రేమ లీలా "

సుశీల నవ్వేసింది. 'అలారండి దారికి-హన్నా అబద్ధాలా! ఇక ఆ విషయం గుర్తు చేసుకోవడం నాకూ ఇష్టం లేదు ఎందు కంటే '

'ఎందుకంటే '

సుశీల మాట్లాడలేదు. తన తలలోవే మల్లెపూలు వాసన చూడసాగింది

* * *

దబదబ తలుపు శబ్దానికి మెలకువ వచ్చింది సుశీలకు. బద్ధకంగా ఆవులించి టైంచూస్తే ఆరు దాటుతోంది. కళ్ళు నులుముకొంటూ తలుపు తీసింది. ఎదురుగా ఇంగారుగా నిలబడ్డ పరమేశాన్ని చూసి ఇంగారుపడింది.

'ఏడీవీడూ నిద్రలేవలా లేపమ్మా కొంచెం అర్జంటూ' అంటూనే వచ్చి కుర్చీలో కూలబడ్డాడు పరమేశం. సుశీల వెళ్ళి రాంబాబును లేపింది

"ప్రొద్దున్నే కొంపలు మునిగి పోతు న్నట్లు నిద్రలేపమని ఎవడు చెప్పాడ్రా నీకూ సుశీలాకాఫీ ఇవ్వవూ "అంటూ వస్తున్నాడు రాంబాబు హాలులోకి.

'కాఫీకాదు వెళ్ళాలి. ఏరా నిన్న మధ్యాహ్నమనగా ఆ సుబ్బిగాడికి ఆక్సిడెం టయి హాస్పిటల్ లో వుంటే నువ్వటు చూడకపోయావు. నేను ఇప్పటివరకూ అక్కడే వుండి వస్తున్నా. ఫర్వాలేదులే. మరీ ప్రమాదం లేదు,చెడ్డలో మంచంటారు చూడు. ఎత్తుపళ్లూ రెండూ రాలిపోయాయి మూతి ఆంజనేయుడి మూతిలావున్నా..."

పరమేశం మాటలు వినడం మానేసిన రాంబాబు భార్య వంక గుర్రుగా చూడ సాగాడు.

—నేమాని సత్యనారాయణ

మరీ మినీ కథ

# శ్రీరంగనీతులు

"ఇవ్వాళ మన గాంధీతాత పుట్టినరోజు. ఈయన మనకు దర్శన మిచ్చిన దేవుడు. అహింసయే ఈయన వేదము. ఈయన అడుగు జాడల్లో నడవడం మన కర్తవ్యం. కావున మీరు ఇవ్వాళ మేకల్ని కోసి మాంసం అమ్మవద్దు" అని గ్రామ పెద్ద జగన్నాథంగారు బోధిస్తున్నారు

అందరూ ఒప్పుకొంటూ ఎవరి దారిన వారు వెళ్లారు. నరసింహం ఒక్కడు మిగిలి పోయాడు. నేడు గడపడం ఎలా? ఇదే ఆయన ప్రశ్న.

రోజూ నరసింహం మేకల చర్మాలు ఇక్కడినుంచి పట్నానికి తీసికెళ్ళి అమ్ము తాడు. అందులో రోజూ మూడు ఒక్కో నాడు నాలుగురూపాయలు సంపాయిస్తాడు. మరి ఇవ్వాళ?

వస్తులు తప్పవనుకొంటూ గొణు క్కొంటూ ఇంటిదారి పట్టాడు.

"గాంధీతాత పుట్టిన్నాడు వస్తులుంటె పుణ్యమైనా లభిస్తది. అతనిలో చోటుచేసు కొందీ వాక్యం.

ఇంట్లోకి అడుగుపెట్టాడు.

"ఏమామె' ఇయ్యాల్ల బేగే ఇంటి కొస్తివి. బ్యారం లేదా?" అందుకొంది భార్య సీతాలు.

సీతాలు జగన్నాథం గారింట పని మనిషి.

"మీ అయ్యగారొచ్చి ఇయ్యాల మేకలు కొయ్యొద్దు. గాంధీతాత పుట్టిన రోజు అని ఇంకేమో చెప్పాడే."

"అయ్యో! నేను ఇప్పుడే అల్లింట్ల కోడ్ని కోసి వస్తున్నగద. అయ్యగారే కొయ్యమంద్రు" అంది అర్థంకాని సీతాలు.

—శశి